సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



బాలుడి గుండెకు చిల్లు
సంగెం మండలం తీగరాజుపల్లికి చెందిన బాలుడు రతన్‌రాజు గుండెకు చిల్లు పడింది. ఆపన్న హస్తం కోసం అతడు ఎదురు చూస్తున్నాడు. - 8లో▸



రామప్పలో కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ క్యాంపు
ములుగు జిల్లా రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపు శనివారం ఐదో రోజు కొనసాగింది. - 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 31°/23°
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అమరవీరుల త్యాగాలు మరువొద్దు: సీపీ



వరంగల్ క్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను ప్రజలు మరువొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరించుకుని పోలీసులు శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సీపీ, అధికారులు, సిబ్బంది అశోకా జంక్షన్ నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పోలీస్ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, రవితో పాటు ఏసీపీలు,ఇన్‌స్పెక్టర్లు,ఆర్‌ఐలు,ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీ యంత్రాలతో ట్రాక్ మరమ్మతు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ పరిధిలో గల మూడో రైల్వే లైన్ మరమ్మతు పనులను ట్రాక్ మల్టీ ఫంక్షన్ ఇండియా (ఎంపీటీ) యంత్రాల సహాయంతో చేపట్టినట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు. ఈ యంత్రాలు కాజీపేట రైల్వే మూడో లైన్ పనులు, ట్రాక్ క్రాసింగ్ పాయింట్లు, ట్రాక్ లెవెల్స్ మరమ్మతులు చేస్తాయని పేర్కొన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఎంపీటీ యంత్రాలను ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.

రైల్వే అధికారి తనిఖీలు

కాజీపేట రూరల్: హసన్‌పర్తి–కాజీపేట మధ్య నిర్మించిన మూడో లైన్, బైపాస్ లైన్ నిర్మాణం, కాజీపేట–వరంగల్ మధ్య నిర్మించిన నాలుగు లైన్ల నిర్మాణాన్ని శనివారం దక్షిణ మధ్య రైల్వే కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ తనిఖీ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇటీవల నూతనంగా నిర్మించిన బైపాస్‌లైన్ నిర్మాణం, నాలుగు లైన్ల నిర్మాణాన్ని కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులతో టెక్నికల్‌పరంగా అన్ని కోణాల్లో చర్చించి ట్రాక్ ఫిట్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలిపారు. ఈతనిఖీలో సికింద్రాబాద్, కాజీపేట రైల్వే అధికారులున్నారు.

మెరిట్ జాబితా ప్రదర్శన

ఎంజీఎం: హనుమకొండ జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 31 పోస్టులకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మెరిట్ జాబితాను శనివారం కార్యాలయంలో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి తెలిపారు. ఈజాబితా మూడు రోజుల వరకు అందుబాటులో ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ తేదీ త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

శిక్షణార్థులు క్రీడల్లో రాణించాలి



మామునూరు: పోలీస్ శిక్షణ కానిస్టేబుళ్లు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని టీఎస్ఎస్పీ కమాండెంట్ రాం ప్రకాశ్ సూచించారు. ఈమేరకు మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో జరుగుతున్న పోలీస్ క్రీడాపోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో ఏసీ కృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, వీరన్న, శోభన్, రాజిరెడ్డి, రమేశ్ రవి, కిరణ్, సర్వర్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

కాళోజీ సెంటర్: ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాల భర్తీ కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ములుగురోడ్డులోని ఐటీఐ ప్రాంగణంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరుకావాలని, పూర్తి వివరాల కోసం 7093168464 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



కొలువుల కుటుంబం

ఒక్కో ఇంట్లో ఇద్దరికి మించి ప్రభుత్వ ఉద్యోగులు

- ఉమ్మడి జిల్లాలో కష్టపడి చదివి లక్ష్య సాధన
- ఉన్నతంగా జీవిస్తూ..ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలు

వాళ్లందరిదీ ఒకే కుటుంబం. తల్లిదండ్రుల కష్టాన్ని దగ్గరి నుంచి చూశారు. భవిష్యత్ ఏమిటన్నదానిపై ఒక నిర్ణయానికి వచ్చారు. కసితో చదివారు. సర్కారు కొలువు అనే లక్ష్యాన్ని సాధించారు. ప్రజా సేవ చేసేందుకు ప్రభుత్వ కొలువుల్లో చేరిన ఒకే కుటుంబ సభ్యులపై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.

సండే స్పెషల్

రైతుబిడ్డలు.. సర్కారీ కొలువులు



ఉద్యోగాలు సాధించిన పిల్లలతో తల్లిదండ్రులు

చెన్నారావుపేట: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన పేద రైతు బానోతు కోబల్–కమలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తల్లిదండ్రుల శ్రమను దగ్గరి నుంచి చూసిన పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. పెద్ద కుమారుడు రవి హుజూరాబాద్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండో కుమారుడు వెంకన్న చెన్నారావుపేట మండలం అమృతండా పాఠశాలలో పనిచేస్తున్నారు. కూతురు రమాదేవి రాయపర్తి మండలం కేశవాపూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు.

తల్లిదండ్రులే కాదు.. కొడుకులు, కూతుళ్లు కూడా..

హసన్‌పర్తి: మొక్కలను కన్న బిడ్డల్లా చూసుకున్నారు. వృత్తిలో భాగంగా రోజూ నీళ్ల పట్టారు. ఇప్పుడవి నీడనిస్తున్నాయి. అదే మాదిరిగా చిన్నప్పటి నుంచే ప్రోత్సాహాన్నందిస్తూ.. కొడుకులు, కూతుళ్లకు ప్రేరణ అందించారు. వారిని సైతం ప్రభుత్వ కొలువులు సాధించేలా చేశారు. ధర్మసాగర్ మండలం పీసరకు చెందిన బానోతు వాలియా– శాంతమ్మ దంపతులు ఉద్యోగ రీత్యా ఎస్సారెస్పీ క్యాంప్ క్వార్టర్స్‌లో ఉంటూ తోటమాలిగా పని చేశారు. వీరికి ముగ్గురు కుమారులు రాజు, రంగన్న, రాజేశ్, ముగ్గురు కూతుళ్లు పార్వతి, అరుణ, అపర్ణ వీరంతా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వీరంతా ప్రభుత్వ ఉద్యోగాలు (రాజేశ్ మినహా) సాధించారు. రాజు కొత్తగూడెం భద్రాచలంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. రంగయ్య (జైళ్ల శాఖ)లో పనిచేస్తున్నారు. రాజేశ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (యూఎస్)లో విధులు నిర్వహిస్తున్నాడు. పార్వతి కరీంనగర్ కమిషనరేట్‌లో సూపరిటెండెంట్‌గా పనిచేస్తున్నారు, అరుణ పరకాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, అపర్ణ ఆదిలాబాద్‌లో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పెద్ద అల్లుడు పోరిక ఓంకార్ సింగ్ నీటిపారుదల శాఖలో పనిచేస్తుండగా.. రెండో అల్లుడు గణేశ్ కూడా టీచరే.



కుమారులు, కూతుళ్లతో వాలియా దంపతులు

ముగ్గురు విద్యాశాఖ.. ఒకరు పీఆర్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎండీ.యాకూబ్ అలీ, ఫాతిమా బీ దంపతులకు నలుగురు కుమారులు. యాకుబ్ గుండెపోటుతో 1990లో మృతిచెందారు. ఆయన పెద్ద కుమారుడు షాహీద్ అలీ స్కూల్ అసిస్టెంట్‌గా గూడూరు మండలం అయోధ్యపురం జెడ్పీ హైస్కూల్లో పని చేస్తున్నారు. రెండో కుమారుడు గౌస్ ప్రస్తుతం కురవి మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మూడో కుమారుడు మహమూద్ అలీ గార్ల మండలం ముల్కనూరు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాలుగో కుమారుడు గులాం రసూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.



తల్లి ఫాతిమా బీ పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న కుమారులు

ఐదుగురూ టీచర్లే..

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అంకతి జనార్దన్ కుటుంబంలో ఐదుగురు టీచర్లే ఉన్నారు. జనార్దన్ స్ఫూర్తితో ఆయన పెద్ద కుమారుడు లక్ష్మణ్, చిన్న కుమారుడు కృష్ణ, కూతురు శైలజ ఉపాధ్యాయ వృత్తి ఎంచుకున్నారు. ఇద్దరు కోడళ్లు ప్రభావతి, జ్యోతి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులే కావడం విశేషం. లక్ష్మణ్ ప్రస్తుతం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభావతి కమలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్నారు. కృష్ణ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పని చేస్తున్నారు. జ్యోతి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో పాఠాలు బోధిస్తున్నారు. శైలజ కరీంనగర్ జిల్లా జమ్మికుంట ఉన్నత పాఠశాలలో చదువు చెబుతున్నారు. విద్యను పంచుతున్న ఈ కుటుంబాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.



జనార్దన్‌తో కుమారులు, కోడళ్లు, కూతురు

అన్నా, చెల్లి టీచర్లు.. తమ్ముడు సీఐ

నెల్లికుదురు: ఏదైనా సాధించాలనే కసితో అహర్నిశలు చదివి ప్రభుత్వ ఉద్యోగస్తులుగా స్థిరపడ్డారు ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన బొమ్మెర యాకలక్ష్మి లచ్చయ్యగౌడ్ సంతానం. లచ్చయ్య కల్లుగీత కార్మికుడిగా వృత్తి నిర్వహిస్తూకూలీ పనులకు వెళ్తూ కూతురు స్వప్న, కుమారులు కేదార్, బాలకృష్ణను చదివించారు. ఆముగ్గురు తండ్రి కష్టాన్ని వృథాగా పోనివ్వలేదు. పోటీపడి చదివి కేదార్, స్వప్న 2008 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్లుగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ప్రస్తుతం మరిపెడ జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. బాలకృష్ణ పోలీస్ శాఖలో 2014లో ఎస్సై ఉద్యోగానికి ఎంపికై ప్రస్తుతం ఖమ్మంలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ కొలువులు సాధించిన ఒకే కుటుంబానికి చెందిన ఈ ముగ్గురు గ్రామానికే వన్నె తెస్తున్నారు.



నెల్లికుదురు చిన్ననాగారంలో ప్రభుత్వ ఉద్యోగులు అన్న, చెల్లి, తమ్ముడు

అధికారం లేక కేటీఆర్‌కు మతితప్పింది

- పాలిటెక్నికల్ కళాశాలకు రూ.28 కోట్లు మంజూరు హర్షణీయం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: మూసీకి పునరుజ్జీవం చేద్దామని చూస్తుంటే ప్రతిపక్షాలు ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నాయని, అధికారం కోల్పోయేసరికి కేటీఆర్‌కు మతితప్పి ఆగమాగం అవుతున్నాడని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.28 కోట్ల నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజాభవన్)లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ధన్యవాదాలు తెలిపారు. ప్రజాభవన్‌కు చేరుకున్న పాలిటెక్నిక్ విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల అంకెల గారడీతో కాలం వెళ్లదీసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు. అందుకు పది నెలల వ్యవధిలో నగరంలో చేసిన అనేక అభివృద్ధి పనులు నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా సీఎం దృష్టికి తీసుకెళ్లిన అంశమే పాలిటెక్నిక్ కాలేజీ అన్నారు. త్వరలోనే నూతన భవన నిర్మాణం ప్రారంభించనున్నామని, రానున్న అతికొద్ది రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కొత్త వరంగల్ నగరాన్ని చూస్తారని అన్నారు. తాము అభివృద్ధి చేస్తూ వెళ్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ తామే చేశామంటూ కొట్టుకుచస్తున్నాయని ఎద్దేవా చేశారు. కొన్ని యూట్యూబ్ చానళ్లతో అసత్యప్రచారం చేయిస్తూ పబ్బం గడుపుతున్నాయన్నారు. కాగా, రాజకీయ, అభివృద్ధిపరంగా పశ్చిమ నియోజకవర్గానికి అన్నీ తానే అంటూ విలేకరుల సమావేశంలో చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

కబడ్డీలో రైడర్‌ని ఒడిసిపడుతున్న క్రీడాకారులు



కబడ్డీ.. కబడ్డీ..

కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు శనివారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పోటీలను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు జరిగాయి. - కేయూ క్యాంపస్ - 8లో▸

స్టాక్ మార్కెట్ పేరిట కుచ్చుటోపీ

- రూ.4.31 లక్షలు గోవిందా

హసన్‌పర్తి: అత్యాశకు వెళ్లిన ఓ యువకుడు స్టాక్ మార్కెట్ ఫేక్ యాప్‌లో పెట్టుబడి పెట్టి రూ.4.31 లక్షలు పోగొట్టుకున్నాడు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన గడ్డం రఘు నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. స్టాక్ మార్కెట్ ద్వారా తక్కువ పెట్టుబడి పెడితే లక్షలు సంపాదించే అవకాశం అంటూ అతడి ఫోన్‌కు 'ఎస్ఎంసీ ఇన్వెస్ట్‌మెంట్' పేరిట మెసేజ్ వచ్చింది. ఆకర్షితుడైన రఘు లింక్ ఓపెన్ చేసి యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. రూ.45 వేలు ఇన్వెస్ట్ చేయగా.. రూ.15 వేలు ప్రాఫిట్ చూపించారు. ఆ తర్వాత మరికొంత మొత్తం ఇన్వెస్ట్ చేయాలని మెసేజ్ వచ్చింది. ఇలా విడతల వారీగా మొత్తం రూ.4.31 లక్షలు యాప్ ద్వారా రఘు ఇన్వెస్ట్ చేశాడు. చివరికి డబ్బులు విత్‌డ్రా కాలేదు. సంబంధిత అగంతకుడితో మెసేజ్ చాటింగ్ ఆగిపోయింది. చివరికి తాను మోసపోయినట్లుగా గుర్తించి బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగాల భర్తీలో అక్రమాలు!

స్టాఫ్‌నర్సులు, పల్లె దవాఖాన డాక్టర్ల నియామకాల్లో గోల్‌మాల్

- బీసీ–బీకి చెందిన వ్యక్తి బీసీ–ఏలో ఎంపికవడంతో గందరగోళం
- రోస్టర్ పద్ధతిలో అవినీతికి తెరలేపారని అభ్యర్థుల ఆందోళన
- వరంగల్ జిల్లా వైద్య విభాగం కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ తనిఖీలు
- డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను టర్మినేట్ చేయాలని ఆదేశం



జెడ్పీ కార్యాలయంలో నియామకాలు చేపడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

సాక్షి, వరంగల్: స్టాఫ్‌నర్సు పోస్టులు, పల్లె దవాఖాన డాక్టర్ల నియామకాల్లో గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హనుమకొండలోని వరంగల్ జెడ్పీ కార్యాలయంలో శనివారం నియామక ప్రక్రియ చేపట్టారు. కొంత మంది అభ్యర్థులు ఆందోళన చేపట్టడంతో అక్రమ నియామకాల వ్యవహారం బయటకు రావడం వైద్య, ఆరోగ్య శాఖలో కలకలం రేగింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ సత్య శారద అక్కడికి చేరుకొని రోస్టర్ పద్ధతిలో ఉన్న ఉద్యోగుల నియామక ప్రక్రియ వివరాలు పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అక్కడ ఉండగానే నేరుగా కార్యాలయానికి వెళ్లి తనిఖీలు చేయడం సంచలనంగా మారింది. ఖమ్మం నుంచి ఇక్కడికి వచ్చిన ఓ ఉద్యోగి, జనగామలో పనిచేస్తూ ఏసీబీకి చిక్కిన మరో ఉద్యోగి ఈ నియామక ప్రకియలో కీలకంగా ఉండడంతో వారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఔట్‌సోర్సింగ్ డాటా ఎంట్రీ ఉద్యోగి మధును టర్మినేట్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. అయితే, ఈ అక్రమ నియామకాల్లో రూ.లక్షల్లో చేతులు మారాయని వైద్య, ఆరోగ్య శాఖలో పలువురు చర్చించుకుంటున్నారు.

వెలుగుచూసిందిలా..

వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో స్టాఫ్‌నర్సులు, పల్లె దవాఖాన డాక్టర్ల నియామక ప్రక్రియ చేపట్టారు. ఈ సమయంలో బీసీ–బీకి చెందిన ఒకరు బీసీ–ఏ కేటగిరీలో ఎంపికవడంతో అక్కడున్న అభ్యర్థులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. డీఎంహెచ్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ నియామకం సాగుతుండగా ఇది అక్రమమని అభ్యర్థులు ఆందోళనకు దిగడంతో ఈ విషయం బయటపడింది. బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్న 15 స్టాఫ్‌నర్సు, ఎంబీబీఎస్ అర్హత ఉన్న ఆరు పల్లె దవాఖాన డాక్టర్ పోస్టుల విషయంలో కీలకంగా వ్యవహరించాల్సింది సదరు వైద్య విభాగం ఉన్నతాధికారే. ఆ తర్వాత ఆఫీస్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్లు. అయితే, రోస్టర్ పద్ధతిన కంప్యూటర్‌లో తప్పుగా డాటా ఎంట్రీ చేయడంతోనే ఇది జరిగిందని అసలైన వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అన్నీ పరిశీలించిన తర్వాతే అధికారులు మెరిట్ లిస్ట్ ఉన్నవారిని పిలవాలి. కానీ, ఔట్ సోర్సింగ్ డాటా ఎంట్రీ ఆపరేటర్ తప్పు చేశాడని, అతడిపై మాత్రమే చర్యలు తీసుకునేలా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ మాత్రం అసలైన బాధ్యులపై చర్యలు తీసుకునే దిశగా ముందుకెళ్తున్నట్లు సమాచారం.

అందరి సహకారంతో వర్సిటీ అభివృద్ధి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి వెల్లడి
- అంతకుముందు బాధ్యతల స్వీకరణ



ప్రతాప్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పక్కన పాలకమండలి సభ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ (వీసీ)గా ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు కె.ప్రతాప్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత యూనివర్సిటీకి వచ్చిన ఆయనకు.. రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో యూనివర్సిటీని అభివృద్ధి చేసుకుందామన్నారు. వీసీని అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, బాధ్యులు, ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, పాలక మండలి సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఎన్జీఓ జనరల్ సెక్రటరీ తిరుపతి, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈసం నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, బాధ్యులు, పాలనాధికారులు, వివిధ విభాగాల డీన్‌లు, అధిపతులు, ప్రిన్సిపాళ్లు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన అవసరం

- ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి
- ఘన వ్యర్థాల నిర్వహణ ఎక్స్‌పో ప్రారంభం



ఘన వ్యర్థాల నిర్వహణ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

రామన్నపేట: తడిచెత్తను ఎరువుగా మార్చడంపై అవగాహన అవసరమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి అన్నారు. శనివారం వరంగల్ వెంకటేశ్వర గార్డెన్‌లో ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) సహకారంతో ఏర్పాటు చేసిన బల్క్ ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ అండ్ ప్రాసెస్ కార్యక్రమానికి ఎమ్మెల్యే, మేయర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నగర ప్రజలు అవగాహనతో స్వచ్ఛ వరంగల్‌గా తీర్చిదిద్దాలని కోరారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. ప్రతీ రోజు నగరంలో 230 టన్నుల బల్క్ ఆర్గానిక్ వ్యర్థాలు, ఇంటింటా తడి చెత్త వెలువడుతోందన్నారు. యంత్రాల ద్వారా ఎరువుగా మార్చే ప్రక్రియను ఆస్పత్రులు, హోటళ్ల నిర్వాహకులు, యజమానులు అవగాహన కలిగి ఉండాలన్నా రు. కమిషనర్ తానాజీ వాకడే మాట్లాడుతూ.. గృహాల్లో బల్క్ ఆర్గానిక్ వ్యర్థాలను అక్కడే ఎరువుగా మార్చుకునే పద్ధతిపై వప్రా కంపోస్టింగ్ కంపెనీ ప్రతినిధులు రూపొందించిన యంత్రం ద్వారా మెన్యూర్ (ఎరువుగా) మార్చుకునే విధానాన్ని ఆచరణాత్మకంగా వివరించారు. ఈసందర్భంగా వివిధ కంపెనీలకు చెందిన వారు బల్క్ ఆర్గానిక్ వ్యర్థాలను ఎరువుగా మార్చే క్రమంలో వారు రూపొందించిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్ తదిరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

వరంగల్: గ్రేటర్ వరంగల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో పలు పథకాల కింద కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్షలో మేయర్ పనులవారీగా సమీక్షించారు. ఎలక్ట్రికల్, సివిల్, వెహికల్ విభాగాలకు చెందిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్పొరేషన్‌కు సంబంధించి వివిధ పథకాలకింద మంజూరైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజయ్య, ఈఈలు మహేందర్, సంతోశ్‌బాబు, డీఈఈ, ఏఈఈలు రంగారావు, శ్రీకాంత్, సారంగం, శివానంద్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పీఆర్ సీఈ కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు - 8లో▸

క్లుప్తంగా

విద్యాకమిషన్ అడ్వయిజరీ కమిటీలో కేయూ ఆచార్యులు

కేయూ క్యాంపస్: తెలంగాణ విద్యాకమిషన్ అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు రిటైర్డ్ ప్రొఫెసర్లకు అవకాశం లభించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళితోపాటు మరో ముగ్గురు సభ్యులను ఇప్పటికే ప్రభుత్వం నియమించిన విషయం విధితమే. అయితే ఈవిద్యాకమిషన్‌కు అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా ఆరుగురిని నియమించగా అందులో కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు మురళీమనోహర్, ఎకానిమిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు వెంకటనారాయణను నియమించారు. మురళీమనోహర్ బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్‌గాను వ్యవహరిస్తున్నారు. ఆచార్య వెంకటనారాయణ సామాజిక ఉద్యమకారులు, తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్‌గా కొనసాగుతూ.. సామాజిక సమస్యలపై పోరాడుతున్నారు. విద్యావేత్తలుగా విద్యారంగంలో వస్తున్న మార్పులపై విద్యారంగాభివృద్ధికి విద్యాకమిషన్‌కు పలు సూచనలు సలహాలు చేసే అవకాశం వీరికి ఉంటుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యులు ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత, ఎంవీఎఫ్ నేషనల్ కన్వీనర్ వెంకటరెడ్డి, ఎడ్యూకేషన్ స్పెషలిస్టు యూనిసెఫ్ కేఎం శేషగిరిరావుకు సైతం ఈకమిటీలో స్థానం లభించింది.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పెన్షనర్స్‌కు పే కమిషన్ ప్రకటించాలి
- ఏఐఆర్ఆర్ఎఫ్ ప్రెసిడెంట్ శ్రీధర్

కాజీపేట రూరల్: రైల్వే రిటైర్డ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 8వ పే కమిషన్‌ను వెంటనే ప్రకటించి, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే ఫెడరేషన్ ఢిల్లీ ప్రెసిడెంట్ ఎస్.శ్రీధర్ డిమాండ్ చేశారు. రిటైర్డ్ పెన్షనర్స్ సమస్యలపై ప్రధాని మోదీ, రైల్వే మంత్రి, రైల్వే బోర్డు అధికారులను కలిసి శనివారం ప్రెసిడెంట్ శ్రీధర్, ఫెడరేషన్ ట్రెజరర్ ఎస్.ఆర్.సీ.రాజు, జోనల్ ట్రెజరర్ స్వామిలు తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కందుల సంగమయ్య, సికింద్రాబాద్ జోనల్ అసిస్టెంట్ సెక్రటరి సీహెచ్ కొమ్మాలు స్వాగతం పలికారు. ప్రెసిడెంట్ శ్రీధర్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పలు డిమాండ్లపై నవంబర్ 13వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే నవంబర్ 28వ తేదీన మహారాష్ట్ర అహ్మద్‌నగర్‌లో 59వ వార్షిక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్స్ మెడికల్ సమస్యలను పరిష్కరించాలని ప్రధాని, బోర్డు అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి
- కేయూ అంతర్‌కళాశాలల క్రీడాపోటీలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పక్కన ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

కేయూ క్యాంపస్: విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీలను హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడారు. క్రీడలు శారీర దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వెంకయ్య మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తితో.. గెలుపే లక్ష్యంగా ఆడాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో క్రీడలపై నిర్లక్ష్యం పెరిగిందని అభిప్రాయపడ్డారు. విద్యతోపాటు క్రీడలను కూడా సమానంగా ఆదరించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్‌లోనే గేమ్స్ ఆడుతున్నారని ఇది విద్యార్థుల శారీరక మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందనేది గమనించాలన్నారు.


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న కేయూ వర్సెస్ ఆర్ట్స్ కాలేజ్


ఖోఖో ఆటలో హోరాహోరీ పోరు

కార్యక్రమంలో ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్, ఖోఖో క్రీడాకారుడు రాజేందర్, డాక్టర్ నెహదా, డాక్టర్ శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. తొలిరోజు కేయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్ బాల్ పోటీలను నిర్వహించారు. తొలుత కేయూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్ల మధ్య కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీలను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. వివిధ క్రీడాపోటీలు ఈనెల 21వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఫుట్‌బాల్, రగ్బీ జట్ల ఎంపిక


క్రీడాకారులతో నిర్వాహకులు

డోర్నకల్: డోర్నకల్ బిషప్ కాంపౌండ్ గ్రౌండ్‌లో శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఫుట్‌బాల్, రగ్బీ జట్ల ఎంపికలు జరిగాయి. త్వరలో జరగబోయే ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 బాలుర, బాలికల రగ్బీ, అండర్–14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీల కోసం డోర్నకల్‌లో ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు క్రీడా ఎంపికకు హాజరయ్యారు. ఇక్కడ ఎంపికయ్యే జట్లు ఉమ్మడి జిల్లా నుంచి త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహించనున్నాయి. క్రీడా ఎంపికలను జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బండి నర్సింహరావు ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ఐ జిల్లా ప్రతినిధులు సత్యనారాయణ, ఓలేటి జ్యోతి, నరేందర్‌గౌడ్, పేటా ప్రతినిధులు కొమ్ము రాజేందర్, విజయచందర్, రవి, సునీల్, గోవర్ధన్, ప్రసాద్, మోజేస్ మనోహర్, అప్పిరెడ్డి, జె.కమల, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఖిలా వరంగల్/కాశీబుగ్గ సెంటర్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఉపాధ్యాయ ఓటరుగా నమోదు చేసుకుని, మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఈమేరకు శనివారం వరంగల్ శంభునిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం వరంగల్ రంగశాయిపేటతోపాటు పలు కళాశాలలు, పాఠశాలలను సందర్శించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు నవంబర్ 6వ తేదీలోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అధ్యాపకురాలు మైదం రూపారాణి, టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాదరావు, రఫూఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కష్టపడితేనే సమాజంలో గుర్తింపు


దీప్తిని సన్మానిస్తున్న అక్షర పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్సై

దంతాలపల్లి: కష్టపడితేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, దీప్తి జీవాంజి చిన్నతనంలో ఎదురైన అవహేళనలను ఎదిరించి ప్రపంచ స్థాయిలో విజయకేతనం ఎగువేసి గుర్తింపు పొందిందని అక్షర పాఠశాల ప్రిన్సిపాల్ యాకేశ్ అన్నారు. ఇటీవల పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తిని శనివారం పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా యాకేశ్ మాట్లాడుతూ.. గతంలో తమ శిష్యురాలైన దీప్తి ప్రపంచ విజేతగా ఎదగడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు పేదరికం, అంగవైకల్యం అనే ఆలోచన చేయకుండా దీప్తిని ఆదర్శంగా తీసుకని లక్ష్యంపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం దీప్తి మాట్లాడుతూ.. రన్నింగ్ చేయాలంటే కుటుంబ పేదరికం వల్ల షూ కొనలేని పరిస్థితి తన చిన్నతనంలో ఉండేదని గుర్తు చేసుకున్నారు. ఖమ్మం నగరంలో జరిగిన పోటీలో పతకం సాధించడం.. ఆర్డీఎఫ్ పాఠశాల రామ్మోహన్‌రావు తన పట్టుదలను గుర్తించడంతోపాటు, నాగపురి రమేశ్ సార్ సహకారంతో ఈస్థాయికి చేరానని తెలిపారు. విద్యార్థులు అధైర్య పడకుండా సాగినప్పుడే జీవిత లక్ష్యాలను చేరుకుంటారని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, చిన్ననాటి గురువు ఎన్నమనేని దేవేందర్, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు
- రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం


సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వరంగల్: తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని, ఉద్యోగాల్లో 20శాతం క్రీడాకారులకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నగరంలోని 14వ డివిజన్ రెడ్డిపురంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలలో శనివారం 9వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ 2024–25ను కలెక్టర్ సత్యశారదతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి నిధులు కేటాయింపుతోపాటు ప్రతీ జిల్లాలో స్పోర్ట్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసిందన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను వరంగల్‌లో నిర్వహిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, కార్యదర్శి పూజారి అశోక్‌బాబును ఆయన అభినందించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. విద్యతోపాటు క్రీడలు సామాజిక అభివృద్ధి, దేహధారుఢ్యం, మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. క్రీడలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అబ్జర్వర్ ఎండీ.అజీజ్‌ఖాన్, ఇన్‌ఫాంట్ జీసస్ హెచ్ఎం మరియమ్మ మథూర్, టి.రాజేందర్, డీవైఎస్ఓ సత్యవాణి, కైలాష్‌యాదవ్, హాసిని చిట్‌ఫండ్ ఎండీ లింగం కిరణ్, కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, జన్ను అనిల్, వెంకటేశ్వర్లు, రఘువీర్, యాదగిరి, ఇంతియాజ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ క్యాంపు


వలంటీర్లు, చరిత్రకారులతో సైంటిస్టు ఆంద్రీ

వెంకటాపురం(ఎం): మండలంలోని రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపు శనివారం ఐదో రోజు కొనసాగింది. శనివారం ఉదయం యోగా ఇన్‌స్ట్రక్టర్ రాంబాబు వలంటీర్లకు యోగాసానాలు నేర్పించారు. ఉదయం 10గంటలకు ఐకోమాస్ ఇండియా ప్రొఫెసర్ జీఎస్‌వీ.సూర్యనారాయణమూర్తి వలంటీర్లకు ఆర్కిటెక్చర్ ఆఫ్ కాకతీయ మాన్యుమెంట్స్‌పై వివరించారు. అనంతరం చరిత్రకారుడు సత్యనారాయణ హిస్టరీ అండ్ కల్చరల్ ఆఫ్ రామప్ప టెంపుల్‌పై వివరించారు. రామప్ప ఆలయాన్ని సందర్శించిన అమెరికా సైంటిస్ట్ ఆంద్రీ శిక్షణ శిబిరంలోని వలంటీర్లతో మాట్లాడారు. రామప్ప ఆలయ, చారిత్రాక కట్టడాలపై నేర్చుకుంటున్న శిక్షణ భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడుతుందని వలంటీర్లకు సూచించారు. హెరిటేజ్ కట్టడాలను కాపాడడంలో వలంటీర్లు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రామప్ప టెంపుల్ బ్యూటిపుల్ : ఆంద్రీ

రామప్ప టెంపుల్ బ్యూటిపుల్ అని అమెరికాకు చెందిన సైంటిస్టు ఆంద్రీ కొనియాడారు. రామప్ప దేవాలయాన్ని శనివారం ఆయన సందర్శించి రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయగా టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్ రామప్ప ఆలయ శిల్పాకళాసంపద గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆంద్రీ మాట్లాడారు. నాటి శిల్పుల గొప్పవారని కొనియాడారు. కాకతీయ కట్టడాలైన వరంగల్ కోట, వేయిస్తంభాలగుడిని సైతం సందర్శించినట్లు తెలిపారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించారు.

పీఆర్ సీఈ కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు

- ఐనవోలు ఎంపీపీ కార్యాలయం పరిశీలన


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

హన్మకొండ : పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయ ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని ప్రస్తుత ఐనవోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ వరంగల్ ఇన్‌చార్జ్ ఎస్ఈ శంకరయ్య, వరంగల్ అర్బన్ డిప్యూటీ సీఈఓ రవితో కలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం పరిశీలించారు.ఈ నెల 23వ తేదీ వరకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. స్థానికంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఉండాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఎంపీపీ కార్యాలయాన్ని ఐనవోలుకు తరలిస్తున్నారు. సోమవారం నుంచి ఐనవోలులో కార్యాలయం పని చేయనుంది. కాగా ఖాళీ అవుతున్న ఎంపీపీ భవనంలోకి పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయాన్ని తరలించాలనే ఆలోచన అధికారులకు వచ్చింది. రాష్ట్రంలో నాలుగు చీఫ్ ఇంజనీర్ కార్యాలయాలను పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసింది. ఇందులో హైదరాబాద్‌లో రెండు, నిజామాబాద్, వరంగల్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దీంతో హనుమకొండలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో తాత్కాలికంగా సీఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా ప్రస్తుతం అక్కడే కొనసాగుతుంది. అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్న ఈ కార్యాలయానికి పూర్తి స్థాయి కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఈ క్రమంలో ఖాళీ అవుతున్న మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. సీఈ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్‌తో పాటు సూపరిండెంట్ ఇంజనీర్, ఇద్దరు డిప్యూటీ ఈఈలు, ఏడుగులు జూనియర్ ఇంజనీర్లు, ఒక సూపరిండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కార్యాలయ పరిధిలో వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, కరీంనగర్, పెద్దపల్లి సర్కిల్‌లు ఉన్నాయి.

ధర్మాపురం యూపీఎస్ తనిఖీ

- హెచ్‌ఎంతో సహా నలుగురు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీచేసిన డీఈఓ

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ధర్మాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఉదయం ప్రార్థన సమయంలో డీఈఓ డి.వాసంతి సందర్శించి, తనిఖీ చేశారు. కాగా పాఠశాల హెచ్‌ఎంతో సహా ఆరుగురు టీచర్లు విధులు నిర్వర్తిస్తుండగా అందులో ఒక్క టీచర్ మాత్రమే ప్రార్థన సమయానికి హాజరయ్యారు. మిగితా వారు ఆలస్యంగా స్కూల్‌కు చేరుకున్నారు. ప్రార్థన సమయంలో విధుల్లో లేని టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు డీఈఓ వాసంతి శనివారం రాత్రి తెలిపారు. హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నపత్రాల కోసం ఎంఈఓ కార్యాలయానికి వెళ్లారని, అయితే మూవ్‌మెంటు రిజిస్టర్ సరిగ్గా నిర్వహించనందుకు అతనికి షోకాజ్ నోటీస్ జారీ చేశారని తెలిపారు. హెచ్‌ఎం అందుబాటులో లేనప్పుడు తదుపరి సీనియర్ ఉపాధ్యాయులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వలేదని, హెచ్‌ఎం, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పర్యవేక్షించకపోవడాన్ని గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. వృత్తిపై, పాఠశాల పట్ల అశ్రద్ధ చూపినందుకు హెచ్‌ఎంకు, ఇతర ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. ఒక్క రోజులో వివరణ ఇవ్వాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నామని డీఈఓ వెల్లడించారు. హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డికి, సురేష్, కె.సత్యనారాయణ (ఎస్‌జీటీలు), ఎ.నర్సింహాచారి (ఎస్‌ఏ–హిందీ) , శ్రీదేవికి (ఎస్‌ఏ–తెలుగు) నోటీసులు జారీచేసినట్లు తెలిపారు.

టీచర్ల వివరాలను ఇన్ఫోలో అప్‌లోడ్ చేయాలి

టీజీడీఎస్సీ–2024 ద్వారా నియమితులైన ఉపాధ్యాయుల వివరాలను టీచర్స్ ఇన్ఫోలో అప్‌లోడ్ చేయాలని డీఈఓ వాసంతి ఆదేశించారు. శనివారం హనుమకొండలోని డీఈఓ కార్యాలయంలో కోఆర్డినేటర్స్, డీసీఈబీ సెక్రటరీ, జిల్లా సైన్స్ అధికారితో సమావేశం నిర్వహించారు. అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ జరిగిందనే విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నూతన టీచర్లకు సన్మానం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న జీటీఏ నాయకులు

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలో డీఎస్సీ–2024లో నూతనంగా ఎంపికైన టీచర్లను శనివారం మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ దుర్గం రవి, గౌరవ అధ్యక్షుడు పొరెడ్డి బుచ్చిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి ప్రకాశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పబ్బోజు వీరాచారి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

డిప్యుటేషన్ టీచర్ల వివరాలు ఇవ్వాలి

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు

విద్యారణ్యపురి : ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో, మండల రిసోర్స్ సెంటర్లలో (ఎంఆర్సీ) దీర్ఘకాలికంగా డిప్యుటేషన్లపై విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఉంటే వారి వివరాలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి తాజాగా డీఈఓలకు ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు, డీసీఈబీ కేంద్రాలు, ఆర్‌జేడీ కార్యాలయాలు, మండల రిసోర్స్ సెంటర్లలో ఏళ్ల తరబడి డిప్యూటేషన్‌పై కొందరు టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారని వారిని విధులనుంచి తొలగించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు లింగారెడ్డి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారని సమాచారం. కాగా పాఠశాల విధులను నిర్వర్తించాల్సిన ఉపాధ్యాయులను డిప్యూటేషన్ల పేర ఇతర పనులు అప్పగించడం సరికాదని, అలాగే ఏళ్ల తరబడి ఒకేచోట డిప్యూటేషన్‌పై కొనసాగించొద్దని ఫిర్యాదు చేశారు.

‘గురితప్పని విలుకాడు’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేం నరేందర్‌రెడ్డి, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై రచించిన ‘గురితప్పని విలుకాడు’ పుస్తకాన్ని శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో అంబేడ్కర్ సచివాలయంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణలో రామగుండం, చొప్పదండి ఎమ్మెల్యేలు మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మేడిపెల్లి సత్యం, ఎమ్మెల్సీ దండె విఠల్, పలు జిల్లాల గ్రంథాలయాల సంస్థల చైర్మన్లు పాల్గొన్నారు. కాగా రాజకీయ సామాజిక వ్యాసాల సంకలనాలుగా ఈపుస్తకాన్ని రూపొందించినట్లు డాక్టర్ సంగని మల్లేశ్వర్ తెలిపారు.

నిరుపేద గుండెకు చిల్లు..

- రతన్‌రాజ్‌కు ఓపెన్ హార్ట్ సర్జరీ
- దాతలు కరుణించి 12 ఏళ్ల బాలుడిని రక్షించాలని తల్లిదండ్రుల వేడుకోలు

దీన గాథ


ఆసుపత్రిలో రతన్ రాజ్

సంగెం: నిరుపేద గుండెకు చిల్లు పడింది. రెక్కడితేనే డొక్కాని నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి ఉంది. అయితే వైద్య ఖర్చులకు చేతిలో చిల్లి గవ్వ లేక దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న ఓ నిరుపేద కుటుంబం దీనగాథ ఇది. వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామానికి చెందిన కారింగుల శ్రీలత, రాజు దంపతులకు కూతురు సిరివెన్నెల, కుమారుడు రతన్‌రాజ్(12) ఉన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తి లేదు. కూతురు సిరివెన్నెల పర్వతగిరిలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి, కుమారుడు రతన్‌రాజ్ తొర్రూరు ఎంజేపీలో 5వ తరగతి చదువుతున్నాడు. రాజు గోపాలమిత్రగా, శ్రీలత ఆశ కార్యకర్తగా పనిచేస్తూ ఉన్నంతలో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆగస్టులో రాఖీ పౌర్ణమికి ఇంటికి వచ్చిన రతన్‌కు జ్వరం వచ్చింది. దీంతో ఆసుపత్రికెళ్లి చూపించగా తగ్గింది. తిరిగి హాస్టల్‌కు పంపిస్తామనుకునే తరుణంలో గుండెలో నొప్పిగా ఉందని బాలుడు చెప్పాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండెకు చిల్లు పండిందని వైద్యులు తెలిపారు. దీంతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిస్తే ఎస్‌టీసీ ఇప్పించగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో స్టంట్ వేయడానికి మూడు సార్లు యత్నించగా వీలు కాలేదు. దీంతో నవంబర్ 4వ తేదీన ఆసుపత్రిలో అడ్మిట్ అయితే రతన్‌కు ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తామని వైద్యులు పేర్కొన్నారు. కాగా, ఇటీవల సిరివెన్నెల కూడా అనారోగ్యానికి గురికాగా సుమారు రూ. 35 వేలు ఖర్చు అయింది. దీంతో ప్రస్తుతం చేతిలో చిల్లి గవ్వలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రతన్‌కు మందులు, రవాణా ఖర్చులకు సుమారు రూ.2.లక్షలకు పైగా అవసరం అవుతుందని, దాతలు ఆదుకుని తమ కుమారుడి ప్రాణం కాపాడాలని తల్లిదండ్రులు శ్రీలత, రాజు వేడుకుంటున్నారు.

దాతలు: 9494291213- కారింగుల రాజు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.